



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న విజయచంద్ర



ఎన్టీఆర్ మహనీయుడు

- ఆయన తెలుగుజాతికే గర్వకారణం
- నివాళి అర్పించిన టీడీపీ శ్రేణులు
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా వర్ధంతి



నివాళి అర్పిస్తున్న గుమ్మిడి సంధ్యారాణి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఎన్టీఆర్ మహనీయుడని పలువురు టీడీపీ నాయకులు కొనియాడారు. తెలుగువారి కీర్తిప్రతిష్టలు దేశవిదేశాలకు చాటిచెప్పిన మహా నాయకుడన్నారు. జిల్లా వ్యాప్తంగా గురువారం ఎన్టీఆర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. అన్ని నియోజకవర్గాల్లో ఆయన విగ్రహాలకు పూలమాలవేసి నివాళి అర్పించారు. పార్వతీపురంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర పార్టీ కార్యాలయంలో ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ తెలుగుజాతికే గర్వకారణమని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్‌లో..

పార్వతీపురం రూరల్: మండలంలోని కృష్ణపల్లి గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కురుపాంలో..

కురుపాం: కురుపాంలో నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. శత్రుచర్ల మాట్లాడుతూ ఎన్టీఆర్‌లాంటి నాయకుడు మళ్లీ పుట్టడని, ఆయన చేపట్టిన సంక్షేమ పథకాలు ఈ రోజుకూ ప్రజలు చెప్పకునేలా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, టీడీపీ అరకు పార్లమెంట్ అధికారి ప్రతినిధి డొంకడ రామకృష్ణ, టీడీపీ అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, మాజీ సర్పంచ్ కిమిడి రామరాజు, టీడీపీ నాయకులు బీహెచ్‌వీ రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో..

సాలూరు: సాలూరులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మిడి సంధ్యారాణి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డీలక్స్ సెంటర్ లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నిమ్మాది తిరుపతిరావు, పరమేష్, వాడాడ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో..

పాలకొండ: పట్టణంలోని కోటదుర్గమ్మ ఆలయం వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ పాలకొండ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ క్షీరాభిషేకం చేశారు. జయకృష్ణ మాట్లాడుతూ తెలుగువారి కీర్తిని దేశవిదేశాలకు చాటిచెప్పిన మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు పల్లా కొండలరావు, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు గంటా సంతోష్‌కుమార్, గండి రామినాయుడు, నాయకులు కిమిడి కాశింనాయుడు, వెన్నపు శ్రీను, సుంకరి అనీల్‌దత్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న చిరంజీవులు



నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు



నివాళి అర్పిస్తున్న జయకృష్ణ తదితరులు

ఇలానే వదిలేస్తారా?

- నిరుపయోగంగా తాగునీటి పైపులు
- రూ.3.25 కోట్లతో కొనుగోలు

గరుగుబిల్లి, జనవరి 18

పార్వతీపురం పట్టణానికి తాగునీరు సరఫరా చేసేందుకు కొనుగోలు చేసిన పైపులు గత కొద్ది నెలలుగా ఇలా వృథాగానే దర్శనమిస్తున్నాయి. దీంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణానికి సంబంధించి తోటపల్లి ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న ప్రధాన పైపులైన్ నుంచి తాగునీటి సరఫరాకు కొన్నాళ్లుగా పనులు చేపడుతున్నారు. దీనిలో భాగంగా సుమారు రూ. 3.25 కోట్లతో ఈ పైపులను కొనుగోలు చేశారు. గరుగుబిల్లి మండలం సుంకి నుంచి అడ్డాపుశీల మీదుగా పార్వతీ పురం పట్టణానికి ఆ పైపులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఉన్న పురాతన పైప్‌ల వల్ల తరచూ లీకేజీ సమస్య ఎదురవుతోంది. ఎప్పటికప్పుడు మరమ్మతులు తప్పడం లేదు. దీంతో పట్టణ శివారు ప్రాంతాలకు తాగునీరు అందడం లేదు. ఈ నేపథ్యంలో యుద్ధప్రాతిదికన తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఆ దిశగా చర్యల్లేవు. వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకానికి శంకుస్థాపన చేసినప్పటికీ.. నిధుల కొరతతో ఎక్కడి పనులు అక్కడే నిలిచాయి గతంలో చేసిన పనులకు చెల్లింపులు కాకపోవ డంతో కాంట్రాక్టర్లు కూడా దృష్టి సారించడం లేదు. దీంతో పైపులు ఇలా నిరుపయోగంగా మారాయి. దీనిపై పార్వతీపురం కమిషనర్ రామప్పలనాయుడును వివరణ కోరగా.. మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు. సంబంధిత ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) ప్రాజెక్టు పనులను సకాలంలో పూర్తి చేస్తామన్నారు. నిధుల సమస్య కారణంగానే కొంతమేర పనుల్లో జాప్యం నెలకొందని చెప్పారు.



ఉల్లిభద్ర సమీపంలో తోటపల్లి ప్రాజెక్టుకు ఆనుకుని ఉన్న ప్రధాన పైపులైన్‌కు చెందిన పైపులు



సాలూరులో కళ్లు, చెవులు మూసుకుని నిరసన



కురుపాం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

భయపడేదే లేదు

- ప్రభుత్వానికి కక్షసాధింపు చర్యలు
- అంగన్‌వాడీ సిబ్బంది ధ్వజం
- కొనసాగుతున్న నిరసనలు

బెలగాం, జనవరి 18: ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, వాటికి భయపడే ప్రసక్తేలేదని అంగన్‌వాడీ సిబ్బంది తేల్చిచెప్పారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ సిబ్బంది పార్వతీపురం కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన దీక్ష కొనసాగుతోంది. సీఎం జగన్మోహన్‌రెడ్డి మొండివైఖరి వీడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేట్టాలని వారు డిమాండ్ చేశారు. తమపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. నెల రోజులకు పైగా నిరసన చేస్తున్నా సీఎం చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి తమ ఆకలిబాధలు కనిపించవా? అని ప్రశ్నించారు. ఎస్మా చట్టం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కళ్ళు చెవులు మూసుకుని..

సాలూరు: ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ గురువారం 38వ రోజు కళ్లు, చెవులు మూసుకుని అంగన్‌వాడీ సిబ్బంది నిరసన తెలిపారు. పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను జగన్ తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

కురుపాంలో..

కురుపాం: ఐసీడీఎస్ పీవో నోటీలసులు ఇవ్వడంతో అంగన్‌వాడీ సిబ్బంది గురువారం కురుపాం ప్రాజెక్టు కార్యాయానికి వెళ్లి వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా అక్కడే నిరసన తెలియజేసారు.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ వేడుకలు జరుగుతాయన్నారు. మైదానంలో ఏర్పాట్లను రహదారులు భవనాల శాఖ చేయాలని, వేదిక పర్యవేక్షణ రెవెన్యూ డివిజన్ అధికారి చూడాలని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారులను ఆదేశించారు. గృహనిర్మాణ సంస్థ, గిరిజన సంక్షేమ శాఖ, జిల్లా విద్యాశాఖ, వ్యవసాయం, ఉద్యానశాఖలు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా నీటియాజమాన్య సంస్థ, దిశ, ఇంజినీరింగ్ శాఖల శకటాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, జేసీ ఆర్.గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లు నగదు రహితం

- కసరత్తు చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు


సాలూరు రూరల్, జనవరి 18: పంచాయతీల్లో పన్నులు నగదు రహితంగా వసూలుకు కార్యదర్శులు కసరత్తు ప్రారంభించారు. జిల్లాలో 451 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో ఇంటిపన్ను, సర్‌చార్జీలు, రోజువారీ మార్కెట్ వసూలు తదితరాలు తప్పనిసరిగా పంచాయతీకి ఆన్‌లైన్, ఫోన్ పే, పేటీఎం, క్యూ ఆర్ కోడ్, ఈ పోస్ ద్వారా చెల్లించాల్సి ఉంది. నగదు రహిత వసూలు విధానం గతేడాది ఆగస్టులోనే నిర్ణయించారు. సాంకేతిక సమస్యల కారణంగా పూర్తిస్థాయిలో అమలు కాలేదు. జిల్లాలో అన్ని పంచాయతీలకు క్యూ ఆర్ కోడ్‌లు, ఈ పోస్ యంత్రాలు అందించారు. మూడు వేల మంది కన్నా తక్కువ ఉన్న జనాభా గ్రామాల్లో క్యూఆర్ కోడ్ ద్వారా, 3 వేలు దాటితే ఈ పోస్ యంత్రాల ద్వారా చెల్లించవచ్చు. జిల్లాలో 451 పంచాయతీల్లో దాదాపు రూ.4.95 కోట్ల పన్నులు వసూలు చేయాలని ఈ ఏడాది మార్చి 31 నాటికి లక్ష్యంగా ఉంది. ఇప్పటికే రూ. 1.20 కోట్లు వసూలు చేశారు. మరో రూ.3.75 కోట్లు గడువులోపు నగదు రహితంగా వసూలు చేయడానికి కార్యదర్శులు కసరత్తు చేస్తున్నారు. ఈమేరకు ఆదేశాలిచ్చామని జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ తెలిపారు.



మామిడిపల్లి పంచాయతీ

చెక్‌ధామ్‌లు!

- పట్టించుకోని ప్రభుత్వం
- నిర్వహణ కరువైన వైనం
- సాగునీరు అందక గిరిజన రైతులకు కష్టాలు



మరమ్మతులకు నోచుకోని కన్నయ్యగూడ చెక్‌డ్యామ్

గుమ్మలక్ష్మీపురం

గిరిజన రైతులకు మేలు చేయాలని... పంటలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన చెక్ డ్యామ్‌లు ఎందుకూ కొరగాకుండా ఉన్నాయి. ఏళ్ల తరబడి నిర్వహణ కరువై...ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోతున్నాయి. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, మక్కువ, పాచిపెంట, సాలూరు మండలాల్లో సుమారు 165 చెక్‌డ్యామ్‌లు ఉన్నాయి. వీటికి గత ఐదేళ్లుగా మరమ్మతులు లేవని గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కాలువల్లో పూడిక తీత కూడా లేదని... దీనివల్ల నీరు సరిగా ప్రవహించడం లేదని వాపోతున్నారు. ఈ ఏడాది తగిన వర్షపాతం లేకపోవడం... చెక్‌డ్యామ్‌ల నుంచి నీరు రాని కారణంగా ఎంతో నష్టపోయామని గిరిజన రైతు మండంగి రమణ ఆందోళన వ్యక్తం చేశారు. ఐటీడీఏ, గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ మైనర్ ఇరిగేషన్ విభాగాల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ఈ 165 చెక్‌డ్యామ్‌లను నిర్మించారు. వీటితో సుమారు ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. గత ప్రభుత్వంలో ఈ చెక్‌డ్యామ్‌ల నిర్వహణకు ఏటా నిధులు మంజూరు చేసేవారు. అయకట్టు రైతు కమిటీల ద్వారా వీటి నిర్వహణ పనులు జరిగాయి. ప్రస్తుత ప్రభుత్వం నుంచి ఒక్కపైసా మంజూరు కాలేదని రమణ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి వారంతా పేద రైతులు కావడంతో... చందాలు పోగుచేసి చెక్‌డ్యామ్‌లకు మరమ్మతులు చేయలేకపోతున్నామన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో గంగ్రవంజరాపుగూడ, రేగిడి, బుద్ధుడి, డుమ్మంగి, చీమలగూడ, జేకేపాడు ప్రాంతాల్లో పెద్ద చెక్‌డ్యామ్‌లు ఉన్నాయి. ప్రతి చెక్‌డ్యామ్ కింద సుమారు వంద ఎకరాల చొప్పున సాగునీరు అందుతుంది. ఇంత ముఖ్యమైన చెక్‌డ్యామ్‌లకు మరమ్మతులు చేయడానికి కూడా గత ఐదేళ్లుగా నిధులు మంజూరు కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగునీటి కాలువల నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని గిరిజన రైతులు కోరుతున్నారు.



నిర్వహణ పనులు చేపట్టని ఎస్.కె.పాడు చెక్‌డ్యామ్

ఉద్యమాలు తప్పవు

చెక్‌డ్యామ్‌లకు మరమ్మతులు చేయకపోతే గిరిజన సంఘం ద్వారా ఉద్యమించక తప్పదు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలి.

-ఎం.రమణ, గిరిజన సంఘ నాయకులు

ప్రతిపాదనలు పంపించాం

చెక్‌డ్యామ్‌ల నిర్వహణకు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

-సింహచలం, డీఈ, గిరిజన సంక్షేమశాఖ, భద్రగిరి

నోటీసులకు భయపడేది లేదు

● డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం
● కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె


గజపతినగరం: అధికారులకు సమాధానపత్రాలిస్తూ..

ప్రభుత్వం అందజేసిన నోటీసులకు భయపడేది లేదని, అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ఆ యూనియన్ నాయకులు హెచ్చరించారు. తమ డి మాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారం కొనసాగింది. అయితే ప్రభుత్వం అందజేస్తున్న షో కాజ్ నోటీసులకుగాను సంబంధిత ప్రాజెక్టు అధికారులకు సమాధాన పత్రాలను అందజేశారు. షోకాజ్ నోటీ సులు అందజేయడంతో పాటు ఎస్మా జీవో తీసుకురావడం ప్రభుత్వ పిరికిపంద చర్య అన్నారు.
-ఆంధ్రజ్యోతి బృందం


భోగాపురం: సమ్మెలో అంగన్‌వాడీలు


కొమరాడ: అంగన్‌వాడీలకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం


సీతంపేట: సంజాయిషీ పత్రాలతో నిరసన..


గుర్ల: పాదయాత్ర చేస్తున్న అంగన్‌వాడీలు


కొత్తవలసలో మానవహారం



బొబ్బిలిలో ధర్నా


బాడంగిలో పాదయాత్ర


ఎస్.కోటలో ..


రాజాం రూరల్: నోటీసులు చూపిస్తూ...

పలు రైళ్ల రద్దు

విజయనగరం, జనవరి 18: ఈస్ట్ కోస్టు రైల్వే పలు రైళ్లను రద్దు చేసింది. ఇప్పటికే సమతా ఎక్స్‌ప్రెస్ రైలును తాత్కాలికంగా రద్దు చేసింది. తాజాగా మరి కొన్ని రైళ్లను రద్దు చేసింది. రాయగడ - సింగుపూర్ రోడ్డు మూడవ లైను ఇంటర్ లాకింగ్ పనులు కారణంగా పలు రైళ్లను రద్దు చేశారు. అయితే పండ గకు వచ్చి తిరుగు ప్రయాణం అవుతున్న తరుణంలో రైళ్ల రద్దుతో ఇబ్బందులు తప్పవని ప్రయాణీకులు భయపడుతున్నారు. రద్దయిన రైళ్లు ఇలా ఉన్నాయి.

విశాఖ - కొరాపుట్(18512) ఇంటర్ సిటీ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను 19, 22, 26 తేదీల్లో రద్దు చేశారు. కొరాపుట్-విశాఖ(18511) ఇంటర్ సిటీ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను 20, 23, 27 తేదీల్లో రద్దు చేశారు. విశాఖ - భవానీపట్నం(8504) 20, 28 తేదీల్లో, భవానీపట్నం-విశాఖ(8503) 20, 28 తేదీల్లో, విశాఖ - రాయ్‌పూర్ (8528) 19, 27 తేదీల్లో, రాయ్‌పూర్ - విశాఖ(8527) 20, 28 తేదీల్లో, విశాఖ - కొరాపుట్(8546) 19, 27 తేదీల్లో, కొరాపుట్ - విశాఖ(8545) 20, 28 తేదీల్లో, బిలాస్‌పూర్-తిరుపతి(17481) 20, 23, 27 తేదీల్లో, తిరుపతి - బిలాస్ పూర్(17482) 18, 21, 25 తేదీల్లో రద్దు చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బొబ్బిలి: పట్టణ పరిధిలోని సంగవీధిలో గల 56, 57 నెంబర్ల పోలింగ్ కేం ద్రాలను గురువారం మున్సి పల్ కమిషనర్ సత్తారు శ్రీనివాసరావు ఇతర అధికా రులు పరిశీలించారు. పోలింగ్ కేం ద్రాలు ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి అనువుగా ఉన్నదీ లేనిదీ పరిశీ లించారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గాలి, వెలుతురు సమృద్ధిగా ఉండేలా కేంద్రాలను తీర్చి దిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమీషనరు తెలి పారు. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం తదితర వాటి కోసం ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందిని కోరారు. మున్సిపల్ మేనేజరు బీఎండీ శివ ప్రసాద్, డీఈఈ కనకరాజు సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

విజయనగరం రూరల్: విజయనగరం నియోజక వర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లు, వీవీ ప్యాట్‌లపై అవ గాహన కల్పించే కార్యక్రమం గురువారం ప్రారంభ మైంది. రానున్న ఐదు రోజుల్లో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద అవగాహన కార్యక్రమాలు జరగనున్నాయి. నగ రంలోని 13వ డివిజన్ పరిధిలోని కొత్తపేట, సాకేటివీధి స్కూల్లో ఉన్న 140, 141, అదే విధంగా నీళ్లట్యాంకు వద్ద ఉన్న 146 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి బీ ఎల్ఏ (బూత్ లెవల్ ఏజెంట్లు), ఇరు పార్టీల నాయకు లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు పాల్గొన్నారు.

సైనిక పాఠశాల వార్షికోత్సవం

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక స్కూల్ వార్షికోత్సవం గురువారం స్కూల్ ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి మాట్లాడుతూ కోరుకొండ సైనిక స్కూల్‌లో విద్యను అభ్యసించిన వారిలో ఇప్పటి వరకూ 700 మంది వివిధ దళాల్లో మంచి హోదాల్లో ఉన్నారని చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

సైన్స్ సదస్సుకు బాలభవన్ విద్యార్థులు

రాజాం: గుజరాత్‌లోని జున్నాగడాలో ఈ నెల 23 నుంచి 26 వరకు థీమ్స్ ప్లాస్టిక్‌ను నిర్మూలించడం ఎలా అనే అంశంపై జాతీయ స్థాయిలో సైన్స్ సదస్సు జరుగనుంది. దీనికి స్థానిక బాలభవన్ విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారని డైరెక్టర్ సంకర రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. షణ్ముఖసాయి, అమిత్, ఎస్.కోమలి, సాయి బాలాజీ ఎంపికయ్యారని వివరిం చారు. వీరిని జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వర రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

స్వయం ఉపాధి శిక్షణకు 22న ఇంటర్వ్యూలు

రాజాం: స్థానిక జీఎమ్ఆర్ నైరడ్‌లో వివిధ కోర్సు ల్లో ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఈనెల 22న ఉద యం 9.30 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించను న్నట్లు పీవో నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 40 ఏళ్ల లోపు వయస్సు గల ఆసక్తి ఉన్న యు వతీ యువకులు ఆధార్ కార్డు తీసుకొని హజరుకా వాలని కోరారు. ఎంపికైన వారికి ఈ నెల 24న తరగ తులు ప్రారంభమవుతాయన్నారు.

22న సెలవు ప్రకటించాలి

రామభద్రపురం: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 22న రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా ఉపాధ్యక్షులు బాదంపూడి శ్రీరామ నాగలింగేశ్వరశర్మ కోరారు. రామభద్రపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిందువుల ఎన్నో ఏళ్ల కల నెరవేరబోతోందన్నారు. ఇటువంటి మంచి తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించాలన్నారు. హిందూ ఫౌండేషన్ నాయకులు వెలవలపల్లి శ్రీనివాసరావు, ఆ వాల మహేష్, బలిజేపల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీప్లస్ గుర్తింపు

శృంగవరపుకోట: శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ బీప్లస్ గుర్తింపును ఇచ్చింది. ఇటీవల ఈ కళాశాలను నాక్ బృందం ప్రొఫెసర్ లక్వంత్ సింగ్, నందజే పూరీ, రమణలాల్ మేడీలు సందర్శించిన విషయం తెలిసిందే. నాక్ నిబంధనలకు అనుగుణంగా సదుపాయాలు వుండడంతో ఈ గుర్తింపు వచ్చిందని ప్రిన్సిపాల్ కేశవరావు తెలిపారు. కళాశాల ఆధ్యాపకులు సంతోషం వ్యక్తం చేసారు.

29న పింఛనుదారుల 'చలో ఢిల్లీ'

బొబ్బిలి: ఈపీఎఫ్-95 పింఛనుదారులంతా ఈ నెల 29, 30 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనాలని ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వి.శేషగిరి, శంకరరావు పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో వారు మా ట్లాడారు. కనీస పెన్షన్‌ను రూ.తొమ్మిది వేలకు పెంచా లని డిమాండ్ చేశారు. రూ.70 లక్షల మంది పెన్షన్ దారులకు మోదీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసింద న్నారు. 2014 ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి అందలమెక్కారన్నారు. ధర్నా కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

సమస్యాత్మక గ్రామాల గుర్తింపు

రామభద్రపురం: బాడంగి, రామ భద్రపురం, తెర్లాం పోలీసు స్టేషన్‌ల పరిధిలో 20 అత్యధిక సమస్యాత్మక గ్రామాలను గుర్తించినట్లు సీఐ తిరు మలరావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గురు వారం ఆయన విలే కరులతో మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా విని యోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్థులపై నిఘా ఏర్పాటు చేశామన్నారు.

తల్లీబిడ్డ మరణానికి ఈ ప్రభుత్వం బాధ్యత వహించాలి

● గిరిజన గ్రామం సందర్శించిన మాజీ ఎమ్మెల్యే కోళ్ల

శృంగవరపుకోట రూరల్, జనవరి 18: మండలంలోని బొడ్డవర పంచా యతీ చిట్టంపాడు గ్రామంలో అనారోగ్యంతో తల్లీబిడ్డలు మరణించిన ఘటనకు వైసీపీ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని, దీనిపై పూర్తిస్థాయి విచారణ చేసి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్ర భుత్వాన్ని డిమాండ్ చేశారు. కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన చిట్టంపాడు గ్రామానికి చెందిన మాదల గంగమ్మ, నెలల చిన్నారి కుటుంబాన్ని పరామర్శించారు. ఇందుకోసం ప్రమాదకరంగా ఉన్న ఏడుకిలోమీటర్ల కొండపైకి మాజీ ఎమ్మెల్యే ధైర్యంగా చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి కు టుంబానికి తనవంతుగా రూ.13వేలు నగదు అందించారు. అనంతరం గ్రామ స్థులు తమ రహదారి ఇబ్బందులను వివరించారు. అనంతరం లలితకుమారి


బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్నలలితకుమారి

మాట్లాడుతూ టీడీపీ హయంలో గిరిశిఖర గ్రామాలకు రోడ్డు సదుపాయం కోసం ప్రణాళికలు రూపొందించి నిదులు కేటాయించామని, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించిందన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న ఫీడర్ అంబులెన్స్‌లు పునరుద్ధరించాలని, పోడుభూములకు పట్టాలు ఇచ్చి వా రికి ప్రభుత్వ పథకాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జీఎస్ నాయు డు, రెడ్డి వెంకన్న, నానిగిరి రమణాజీ, బీశెట్టి అరుణ, ఇందుకూరి శ్రీనివాసరాజు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

శాంతి భద్రతలపై అప్రమత్తం

● ట్రైనీ జేసీ వెంకట్ త్రివినాగ్

వంగర, జనవరి 18: లక్ష్మింపేటలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సిబ్బంది, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ట్రైనీ జేసీ బి. సహదిల్ వెంకట త్రివినాగ్ చెప్పారు. లక్ష్మింపేట ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణతో పాటు ఇటీవల మరో అట్రాసిటీ కేసు గ్రామంలో నమోదు కావడంతో కలెక్టర్ నాగలక్ష్మి గ్రామంలో విచారణకు ఆదేశించారు. దీంతో గురువారం జేసీతో కలసి ఆర్డీవో బొండపల్లి శాంతి విచారణ చేపట్టారు. గ్రామంలో గతంలో జరిగిన ఘట నపై ఆరా తీశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణకు సహకరించాలని కోరారు. బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దళిత, బీసీ వాడల్లో వేరువేరుగా విచారణ చేపట్టిన అధికారుల బృందం అంతా రికార్డు చేశారు. గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణకు అదనపు సిబ్బందిని పెంచడం గానీ, లేదా 104 సెక్షన్ అ మలు చేయాలన్నారు. ఇప్పటికే దీనిపై కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినట్లు జేసీ చెప్పా రు. ముఖ్యంగా పోలీసు సి బ్బంది గ్రామంలో అప్రమ త్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిఐ శ్రీనువా సరావును ఆదేశించారు. ఇ ప్పటికే రెండు వర్గాల నుంచి కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. జేసీ వెంట తహసీల్దార్ ఐజాక్, ఆర్ఐ రమణ, ఎస్ఐ జనా ర్దన్ తదితరులు ఉన్నారు.


గ్రామంలో దర్యాప్తు చేస్తున్న జేసీ బృందం

● లక్ష్మింపేట ప్రత్యేక కోర్టులో శుక్రవారం విచారణ జరగనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. రాజాం సీఐ శ్రీనువాసరరావు ఇప్పటికే గ్రామంలో పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు.

సీఎం జగన్‌రెడ్డి హయాంలో దోపిడీ

● మాజీ మంత్రి కోండ్రు

రాజాం, జనవరి 18: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భూములను దోచుకుంటూ.. సీఐడీని అడ్డం పెట్టుకొని నాలుగున్నరేళ్లుగా పరిపాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ మండిపడ్డారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2004లో రూ.1.73 కోట్లు మాత్రమే ఆస్తి కలిగి ఉన్న జగన్ 19 ఏళ్లలో రూ.రెండు లక్షల కోట్లు ఎలా కూడబెట్టారని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపైన, ఇతర నాయకులపైన పెట్టిన కేసుల్లో ఇంతవరకు సీఐడీ చార్జిషీటు ఎందుకు వేయలేకపోయిందని ప్రశ్నించారు. తీవ్ర నేరారోపణలు కలిగిన సీఎం జగన్‌పై 38 కేసులు ఉన్నాయ న్నారు. రూ.43 వేల కోట్ల దోపిడీపై సీబీఐ చార్జిషీట్లు వేసిందన్నారు. ● నారా చంద్రబాబునాయుడు తోనే బీసీల సంక్షేమం సాధ్యమని మాజీ మంత్రి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీ మోహన్ అన్నారు. గురువారం రాత్రి శ్యాంపురం క్యాంపు కార్యాల యంలో నిర్వహించిన బీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు తన అనుభవంతో బీసీలందరినీ ఏకం చేయాలని భా వించి బీసీ సాధికార సమితులకు రూపకల్పన చేశారన్నారు. రూ 75,760 కోట్లు సబ్ ప్లాన్ నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందని మండిపడ్డారు. కంది సన్యాసినాయుడు, విజయకుమార్, నారాయణరావు, మోహన్‌రావు తదితరులున్నారు.

మరిడిమాంబకు ప్రత్యేక పూజలు

లక్కవరపుకోట, జనవరి 18: మండలంలోని రేగ గ్రామంలో వెలసిన మరిడిమాంబకు గురువారం గ్రామస్థులంతా పసుపుకుంకుమలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు. తీర్థ మ హోత్సవ సందర్భంగా వందలాది మంది భక్తులు త మ మొక్కులను చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శ నం కొసం భక్తులు బారులు తీరారు. ఉదయం నుంచి మరిడిమాంబ ఆలయంకు భక్తులు తాకిడి ఎక్కువ గానే ఉంది. భక్తులు పసుపు కుంకుమలతో పాటు దూపదీప నైవేద్యాలు అమ్మవారికి సమ ర్పించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించారు. రావాడ నీలకంఠం, బొడ్డు గణపతి, యడ్ల ఈశ్వరరావు, రావాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పూజలందుకుంటున్న మరిడిమాంబ

వికలాంగుల డిమాండ్లు పరిష్కరించాలి

లక్కవరపుకోట, జనవరి 18: రాష్ట్రవ్యాప్తంగా వికలాంగులు ఎదుర్కొంటు న్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గురువారం భీమాలిలో నిరసన తెలిపారు. వికలాంగుల పింఛన్లు తొలగించినవి వెంటనే పునరుద్ధరణ చేయాలని, వికలాంగుల కుటుంబానికి 35 కిలోల అంత్యోదయ కార్డులు ఇవ్వా లని, భార్య, భర్తలు ఇద్దరు వికలాంగులైతే ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లను పూర్తి స్థాయిలో తెరిపించాలి

బొబ్బిలి, జనవరి 18: ఈ నెల 19 నుంచి డిగ్రీ పరీక్షలు ప్రారంభమవు తున్న నేపథ్యంలో ప్రభుత్వ హాస్టళ్లను పూర్తిస్థాయిలో తెరిపించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేస్తోంది. ఆ సంఘం జిల్లా నాయకుడు బి.రవికుమార్ గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. తక్షణం ప్రభుత్వ వసతిగృహాలను తెరిపించాలని లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

కోడి పందేలపై దాడి

వేపాడ: వీలుపర్తి, పాటూరు గ్రామాల్లో గురువారం తీర్థమహోత్సవాల సంద ర్భంగా నిర్వహించిన కోడి పందాల శిబిరాలపై దాడి చేసి వీలుపర్తిలో ముగ్గురు వ్యక్తులను పట్టుకొని మూడు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్టు వల్లంపూ డి ఎస్ఐ కే.రాజేష్ తెలిపారు. పాటూరులో ఒక వ్యక్తిని పట్టుకోవడంతో పాటు అతని నుంచి ఒక పందెం కోడిని స్వాధీనం చేసుకుని, వారిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం

కలెక్టరేట్, జనవరి 18: ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు త్వరగా పూర్తి చేయాలని కలె క్టర్ నాగలక్ష్మి కోరారు. రాష్ట్రం లోని లబ్ధిదారులకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి వీడియో కా న్ఫరెన్స్ ద్వారా గురువారం వడ్డీ రాయితీ జమ చేశారు. తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. దీనిలో భాగంగా జిల్లాలోని సుమారు 29,686 మంది లబ్ధిదారులకు రూ.301 కోట్లు వడ్డీ రాయితీని జమ చేశారు. దీనికి సంబంధించిన చెక్కును లబ్ధిదా రుల కు కలెక్టర్ అందజేశారు. హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరైన కలెక్టర్

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో ఈ నెల 26న నిర్వహించే గణతంత్ర వేడుకల్లో ఏడాది కాలంలో సాధించిన ప్రగతిని ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది కాలంలో ప్రభు త్వం కొత్తగా చేపట్టిన జగనన్న సురక్ష, ఆరోగ్య సురక్ష, ఆడుదాం ఆంధ్ర, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర, పీఎం జనమాన్ వంటి కార్యక్రమాలపై స్టాల్స్, శక టాలు ఏర్పాటు చేయాలన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రగతిని ప్రతి బింబించే శకటాలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఆడుదాం ఆంధ్రా వంటి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో ప్రతిభ కనబరిచిన వారిని ప్రశంసాపత్రాల కోసం సిఫారసు చేయాలని సూచించారు. జేసీ మయూర్ అశోక్, డీఆర్‌వో అనిత పాల్గొన్నారు.

అనుమానితుల సమాచారం ఇవ్వండి

విజయనగరం క్రైమ్, జనవరి 18: రైళ్లలో నిషేధిత సామ గ్రితో పాటు మద్యం నిల్వ లను తరలించే వారి స మాచారం తెలిపితే బహు మతి అందిస్తామని జీఆర్ పీ సీఐ వెంకట్రావు అన్నా రు. గురువారం విజయనగరం రైల్వే స్టేషన్ ఆవరణ లో రైల్వే ఉద్యోగులు, రైల్వే ఆటో, టాక్సీ స్టాండ్ యూనియన్లతో అవగాహన కా ర్యక్రమం నిర్వహించారు. ప్లాట్‌ఫామ్‌పై అనుమానాస్పద ప్రయాణికుల బ్యాగు లు తనిఖీ చేశారు. జీఆర్‌పీ ఎస్సై వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ వెంకట్రావు

కుల గణనపై సమావేశం

బొబ్బిలి: ఈ నెల 19 నుంచి 28 వరకు జరగనున్న కులగణన ప్ర క్రియ కోసం పాటించాల్సిన విధి విధా నాలపై మున్సిపల్ కమిషనర్ సత్తారు శ్రీనివాస రావు గురువారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

సీఎం బ్యానర్ల చించివేత

రాజాం రూరల్, జనవరి 18: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్లపై ముద్రించిన ముఖ్యమంత్రి ఫొటోతో పాటు స్థానిక ఎమ్మెల్యే కంబాల జోగులు ఫొటోలు చిరిగి ఉండడం రాజాం ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది. రాజాం మున్సిపల్ యంత్రాంగం స్థానిక ప్రయివేటు డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఆటల పోటీలకు సంబంధించి స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. స్వాగత ద్వారాలపై ఉన్న ఆ ఇద్దరి ఫొటోలు మాత్రమే చిరిగి ఉండడం చర్చకు దారి తీసింది.



సీఎం, ఎమ్మెల్యే జోగులు ఫొటోలు చిరిగి ఉన్న స్వాగత ద్వారం ఫ్లెక్సీ

దళితద్రోహి ముఖ్యమంత్రి జగన్

విజయనగరం దాసన్నపేట, జనవరి 18: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అంబేద్కర్ స్మృతివనం పేరుతో దళితులను మోసగించేందుకు ప్రయత్నం చేస్తున్నారని.. ఆయన దళిత ద్రోహి అని ఆ సంఘాల నేత ఆదాడ మోహనరావు ఆరోపించారు. గురువారం కలెక్టరేట్ సమీపంలోని అంబేద్కర్ విగ్ర హం వద్ద 'జగన్ అంతం.. దళితుల పంతం' అనే నినాదంతో నిరసన కార్య క్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే వంద ఎకరాల్లో అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి... కేవలం 18 ఎకరాల్లోనే ఏర్పాటు చేశారన్నారు. రూ.400 కోట్లు ఖర్చ యిందని ఆరోపించారు. ఇందులో కూడా అవినీతి జరిగిందన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో దళితులు, గిరిజనులను మోసం చేసేందుకు పన్నాగం పన్నుతున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో దళిత గిరిజనులు తగిన గుణ పాఠం చెప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు పాండ్రంకి వెంకట రమణ, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలియజేస్తున్న దళితులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సాలూరు రూరల్: వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన మండ లంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి సాలూరు రూరల్ ఎస్‌ఐ ఎంవీ రమణ గురువారం విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీగిరాంకు చెందిన చింతల తిరుపతి(43) లారీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఎప్పటిలాగే నిద్రపోయిన తిరుపతి గురువారం ఉద యం లేచి చూసే సరికి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. స మాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తర లించారు. ఆయనకు కొద్దిరోజులుగా ఆరోగ్యం బాగులేదని భార్య సుగుణ తెలి పారు. తిరుపతి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ తల్లి అప్పలమ్మ చే సిన ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చే స్తున్నామని పోలీసులు తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మద్యం షాపులో చేతివాటం

● రూ.2.09లక్షలు గల్లంతు.. రికవరీ చేసిన అధికారులు

పాలకొండ: వీరఘట్టం కొత్త బస్టాండ్‌లో ఉన్న ప్రభుత్వ మద్యం దుకా ణంలో సిబ్బంది చేతివాటం చూపించారు. దీనిపై పార్వతీపురం మన్యం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సి.మధుబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ షాపుపై తరచూ ఫిర్యాదులు వస్తుండడంతో ఎక్సైజ్ పోలీసులు గురువారం ఆ షాపును తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 1,194 మద్యం సీసాలు మాయం అయి నట్టు గుర్తించారు. ఈ మద్యం సీసాలకు సంబంధించి రూ.2.09లక్షలు ఏమ య్యిందని ఆరా తీశారు. ఆ మొత్తాన్ని సిబ్బందితో రికవరీ చేశారు. సిబ్బందిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

సాలూరు: పాచిపెంట మండలం కంకనాపల్లి ఫారెస్ట్ బీట్‌లో అటవీశాఖ పర్యవేక్షణలో పెరుగుతున్న టేకు చెట్లను నరికి తరలిస్తున్న వారిపై కేసు నమో దు చేసినట్లు రేంజర్ కారు రామారావు గురువారం తెలిపారు. పాచిపెంట మండలం కంకణాపల్లి ఫారెస్టబీట్‌లో 24 టేకు చెట్లను తారాపురం గ్రామానికి చెందిన శ్రీను, శంకర్, వెంకటేష్ ఈ నెల 11 తేదీన అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామని, నిందితులపై కేసు నమోదు చేయటంతో పాటు 50 టేకు దుంగలను స్వాధీనం చేసుకుని యార్డుకు తరలించినట్లు తెలిపారు. వీటి విలు వ సుమారు 2లక్షల 9వేలు ఉంటుందన్నారు. టెకు చెట్లను నరికి తరలిస్తున్నవా రు గతంలో అటవీశాఖ అధికారులకు సహాయకులుగా పనిచేయడం గమనర్హం.

గంజాయి పట్టివేత

గజపతినగరం: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నట్టు ట్రైనీ డీ ఎస్పీ మహేంద్ర, ఎస్సై మహేష్ తెలిపారు. గురువారం స్థానికంగా జాతీయ ర హదారిపై వాహనాల తనిఖీ చేస్తుండగా గంజాయి పట్టుబడినట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి ఒడిసా నుంచి కేరళ తరలిస్తున్నట్లు గుర్తించామని, నిం దితులను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు. దర్యా ప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

విజయనగరం క్రైం: జిల్లా కేంద్రంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డెంకాడ మండలం గొండయ్యపాలెం శివార్లలో అక్రమంగా మద్యం నిల్వలను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 53 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ రామచంద్రకుమార్ తెలిపారు. ఇంటెలిజెన్స్, సెబ్ రూరల్ సిబ్బంది ఈ దాడిలో పాల్గొని నిందితుడిని అదుపులోకి తీసుకుని, 41ఎ సీఆర్‌పీసీ కింద స్టేషన్ బెయిల్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ బి లలిత, ఎండీ భాషా, ఎస్సై కరుణలత, సిబ్బంది పాల్గొన్నారు.

రేగిడి: వెంకమ్మపేటకు చెందిన ఒక వ్యక్తి నుంచి అనధికారికంగా తరలి స్తున్న 40 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్ ఐ శ్రీనివాస్ తెలిపారు. ఉంగరాడమెట్ట నుంచి మద్యం సీసాలు తరలిస్తుండగా నిందితుడిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడి

రాజాం రూరల్: మున్సిపాలిటీ పరిధిలో కొండంపేట వద్ద పేకాట శిబిరంపై రాజాం టౌన్ సీఐ కే రవికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం దాడిచేసి లక్షా 2వేల 640 స్వాధీనం చేసుకున్నారు. ఘటనలో 16 మందిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ● **రేగిడి:** అంబఖండి శివారులో గురు వారం పేకాట శిబిరంపై నిర్వహించిన దాడిలో ఐదుగురు వ్యక్తులు పట్టుబడి నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. వారి నుంచి రూ.19,860 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

నేడు దుబాయ్ నుంచి రానున్న కార్మికుడి మృతదేహం

జామి, జనవరి 18: జామికి చెందిన కొత్తలి బంగారునాయుడు గత ఏడాది డిసెంబర్‌లో దుబాయ్‌లో మృతిచెందాడు. అతని మృతదేహం శుక్రవారం స్వగ్రా మానికి రానుంది. మృతదేహాన్ని తెప్పించాలని కుటుంబ సభ్యులు రాష్ట్ర ప్రభు త్వంతో పాటు కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం కనిపించలేదు. దీంతో మాజీ జడ్‌పీటీసీ బండారు పెదబాబు ఈ నెల 1న శ్రీకాకుళం వెళ్లి ఎంపీ రామ్మోహన్ నాయుడుకు సమస్యను వివరించారు. దీంతో ఎంపీ అక్కడి ఎంబసీ అధికా రులతో మాట్లాడి మృతదేహాన్ని తెప్పిస్తున్నారు. మరణించిన 20 రోజుల తరు వాత తన భర్త మృతదేహం వస్తుండటంపై భార్య, కుటుంబ సభ్యులు ఉద్వేగా నికి గురయ్యారు. పక్క జిల్లా ఎంపీ, తెలుగుదేశం నాయకుడు కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కృషితో, మాజీ జడ్‌పీటీసీ చొరవతో కడసారి చూపు దక్కుతోందని స్థానికులు చెబుతున్నారు. తహసీల్దార్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ మృతదేహాన్ని తీసుకురావడానికి సంబంధిత పత్రాలు జిల్లా అధికారుల ద్వారా పంపించామని, ప్రత్యేక వాహనం ఏర్పాటు చేశామన్నారు. బంగారునాయుడు చనిపోయిన దగ్గర్నుంచి కు టుంబ సభ్యులకోసం తెలుసుకోవడానికి ఒక వీఆర్‌వోను కేటాయించామ న్నారు.

జీపీడీపీపై శిక్షణ

బొబ్బిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచా యతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)లపై శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీ డీవో రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈఓపీఆర్‌డీ భాస్కరరావు సంబంధించిన అంశాలను గ్రామ పంచాయతీల సారథులకు వివరించారు.

సంక్షేమ పథకాల ఆద్యుడు ఎన్టీఆర్

● దివంగత నేతకు ఘన నివాళి
● జిల్లా వ్యాప్తంగా వర్ధంతి కార్యక్రమాలు

సంక్షేమ పథకాల ఆద్యుడు, పేదల పెన్నిధి ఎన్టీఆర్ అని టీడీపీ నాయకులు కొనియాడారు. టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. తాను ముఖ్యమంత్రి ఉన్నప్పుడు రాష్ట్రాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.
(ఆంధ్రజ్యోతి బృందం)


సాలూరు రూరల్: శివరాంపురంలో సంధ్యారాణి ఆధ్వర్యంలో..


సీతంపేట: నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో..


కొమరాడ: దుస్తులు పంపిణీ చేస్తున్న ఉదయశేఖరపాత్రుడు


పాచిపెంటలో రక్తదానం చేస్తున్న యువకులు


గుమ్మలక్ష్మీపురంలో..


సీతానగరం: బలిజిపేట మండలం పెదపెంకిలో..


భామినిలో..


పార్వతీపురం: ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి


పార్వతీపురంలో..


గరుగుబిల్లి: ఉల్లిభద్ర ప్రాజెక్టు ప్రాంతంలో ..


మక్కువలో..


పార్వతీపురం రూరల్: నర్సిపురంలో..

టీడీపీ నాయకుల నివాళి

శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలో గురువారం ఎన్టీఆర్ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి నివాళులు అర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మాజీ వైఎస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, కొండం మల్లేశ్వరరావు, కాపుగంటి వాసు, భీశెట్టి అరుణ తదితరులు ఉన్నారు. ● **రాజాం:** మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ ఆయన విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. పార్టీ నాయకులు గురవాన నారాయణ రావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, నంది సూర్యప్రకాష్‌రావు, సుమల వెంకట మన్మథరావు పాల్గొన్నారు. ● **నెల్లిమర్ల:** సంక్షేమ పథకాల రూపశిల్పి ఎన్టీఆర్ అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. దివంగత నేత ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం నెల్లిమర్లలోని రామతీర్థం జంక్షన్‌లో ఆయన విగ్రహానికి బంగార్రాజు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, కడగల ఆనంద్‌కుమార్, కంది చంద్రశేఖరరావు, గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, బయిరెడ్డి లీలావతి, అట్టాడ శ్రీధర్ (బుజ్జి), అవనాపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

జరజాపుపేటలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కడగల ఆనంద్‌కుమార్, కంది చంద్రశేఖరరావు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేయండి

మక్కువ: సాలూరులో పార్టీ కోసం అంకితభావంతో కష్టించి పని చేయాలని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పార్టీలో చేరిన ఎం.తేజోవతితో అన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో ఆమె గురువారం విజయవాడలో చంద్రబాబును కలిశారు. ఆమెకు ఆయన మరోసారి పార్టీ కండువా వేశారు. సాలూరులో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.


తేజోవతికి పార్టీ కండువా వేస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు

టీడీపీలో చేరిక

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం నియోజకవర్గంలో టీడీపీలో చేరికలు కొనసాగుతున్నాయి. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో సీతానగరం మండలం యోగోటివలస గ్రామానికి చెందిన పలువురు టీడీపీలో చేరారు. వీరందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. విజయచంద్ర మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సీతానగరం మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి వేణు, కౌన్సిలర్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరినవారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న విజయచంద్ర

రహదారి పనులకు అనుమతులు జారీ చేయాలి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూ రహదారి పనులకు అనుమతులు త్వరగా జారీ చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ కోరారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామన్నారు. భూ రికార్డులు, జగనన్న ఆరోగ్య సురక్ష అంశాలపై గురువారం జిల్లా కలెక్టర్లతో జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన, ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూ రహదారి పనులు చేపట్టడానికి అనుమతులను కేంద్ర ప్రభుత్వం విభాగం నుంచి పొందాల్సి వస్తుందని, తద్వారా జాప్యం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష రిఫరల్ కేసులపై దృష్టి సారించాలన్నారు. కంటి వెలుగు కింద కళ్లద్దాలు పంపిణీ వేగవంతం చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఆర్.గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరావు, అధికారులు పాల్గొన్నారు.

శంబరకు భక్తుల తాకిడి

మక్కువ: శంబర పోలమాంబ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులతో చదురు గుడి కిటకిటలాడుతోంది. జాతర సమీపిస్తున్న నేపథ్యంలో శంబర గ్రామానికి భక్తుల తాకిడి పెరిగింది. అమ్మవారిని గురువారం ప్రత్యేకంగా అలంకరించారు. వనంగుడి, చదురుగుడి వద్ద క్యూలైన్ల ఏర్పాట్లను అధికారులు వేగవంతం చేస్తున్నారు. మక్కువ రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో గ్రామానికి వాహనాల రాకపోకలు పెరిగాయి.


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలి

గరుగుబిల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీ విజయవంతంగా పూర్తి కావాలంటే అందరి భాగస్వామ్యం అవసరమని ఎంపీపీ యు.రామారావు, ఉమ్మడి జిల్లాల జడ్పీ వైస్ ఛైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామాభివృద్ధి ప్రణాళికలు తయారీపై 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎంపీటీసీ సభ్యులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి కచ్చితమైన ప్రణాళికలు అవసరమని పేర్కొన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలపై ముందస్తుగా చర్చించడం ద్వారా ఒక కచ్చితమైన ప్రణాళిక రూపొందించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు, ఏపీవో ఎం.గౌరీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కిమ్మిలో బాబు ష్యూరిటీ

పాలకొండ (వీరఘట్టం): రానున్న ఎన్నికల్లో పాలకొండ నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేస్తామని పాలకొండ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. వీరఘట్టం మండలం కిమ్మి గ్రామంలో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టో వివరాలను కరపత్రాల రూపంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వీరఘట్టం మండల అధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్, ప్రధాన కార్యదర్శి చింత ఉమా, నాయకులు ఆలుబిల్లి ఉమామహేశ్వరరావు, వాన రాంబాబు, నివర్తి శశి, కుమారస్వామి, జనసేన నాయకులు రౌతు గోవిందరావు, కార్యకర్తలు, కిమ్మి ప్రజలు పాల్గొన్నారు.

ఒడిశాలో ఎదురు కాల్పులు

● మావోల డంప్ స్వాధీనం

సాలూరు రూరల్: ఒడిశా రాష్ట్రం బౌద్ జిల్లా బుధాఖోల్ అటవీ ప్రాంతంలో గురువారం డీవీఎఫ్ (డిస్ట్రిక్ట్ వలంటీర్ ఫోర్స్) ఎస్‌వోజీ (స్పెషల్ ఆపరేషన్ గ్రూప్) దళాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. మావోయిస్టులు ఉన్నట్టు సమాచారంతో ఇరు దళాలు సంయుక్తంగా అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టాయి. ఈ దళాలపై మావోయిస్టులు కాల్పులు జరపడంతో ఎదురు కాల్పులు చేశారు. గంటన్నరకు పైగా కాల్పులు జరిగాయి. ఇరు వైపుల నుంచి కాల్పులు నిలిచిపోవడంతో పోలీసు దళాలు సంఘటన ప్రాంతానికి వెళ్లాయి. మావోయిస్టులు అప్పటికే తప్పించుకున్నారు. మందుపాతర, వైర్లు, మందులు, యూనిఫారాలు, సాహిత్యం లభించినట్టు ఒడిశా పోలీసులు ప్రకటించారు.

ఓటు వినియోగంపై అవగాహన

ఒడిశా

రాయగడ: రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఓటు వినియోగంపై జిల్లా యంత్రాంగం వివిధ ప్రాంతాల్లో అవగాహన కేంద్రాలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా కొత్తగా ఓటు హక్కును పొందిన యువతకు ఈ అవగాహన కేంద్రాలు ఉపయోగపడతాయని డివిజనల్ సోషల్ సెక్యూరిటీ అధికారి శ్రీకాంత్ కుమార్ పాణిగ్రాహి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు యువతీ యువకులు పాల్గొని, ఓటు వేశారు.


అవగాహన పోలింగ్ కేంద్రంలో ఓటు వేస్తున్న యువతి

అలరించిన జగన్నాథ పరిక్రమ నాటకం

రాయగడ: శ్రీక్షేత్రం పూరీలో జగన్నాథ పరిక్రమ ప్రాజెక్టు ప్రారంభం సందర్భంగా స్థానిక బిజూపట్నాయక్ ఆడిటోరియంలో బుధవారం రాత్రి ప్రదర్శించిన జగన్నాథ పరిక్రమం నాటకం ఎంతగానో అలరించింది. ప్రేక్షకులు అధిక సంఖ్యలో నాటకాన్ని తిలకించారు. నాటక రచయిత డాక్టర్ నరేంద్రకుమార్ స్వీయ దర్శకత్వంలో దీన్ని ప్రదర్శించారు.


నాటకంలో ఓ సన్నివేశం

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించండి

● ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

సీతంపేట: నియోజకవర్గ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సెక్టార్ అధికారులు, పోలీసు శాఖ కలిసి గుర్తించాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఆదేశించారు. గురువారం సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పీవో మాట్లాడుతూ సెక్టార్ పరిధిలో ఏదైనా పోలింగ్ స్టేషన్ మార్పు చేయాల్సి ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలవంచ వద్దన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల తహశీల్దారులు, సెక్టార్ అధికారులు, పోలీస్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కల్పనాకుమారి

పర్యాటక కేంద్రంగా ఎస్‌కేపాడు నర్సరీ

గుమ్మలక్ష్మీపురం: సవరకోటపాడు హార్టికల్చర్ నర్సరీ, శిక్షణ కేంద్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్టు పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ తెలిపారు. గురువారం ఎస్‌కేపాడు హెచ్‌ఎంటీ నర్సరీలో పర్యాటక పనులను పరిశీలించారు. ఈ నర్సరీని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. పనులు పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ శాంతీశ్వరరావును ఆదేశించారు. ఆయన వెంట టీడబ్ల్యూడీఈ సింహాచలం, ఏఈ శ్యాం ప్రసాద్, వాటర్‌షెడ్ అధికారి నాయకుడు తదితరులున్నారు.


ఎస్‌కే పాడు నర్సరీని పరిశీలిస్తున్న పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్

ఈవీఎంలపై అవగాహన

కొమరాడ: పెదఖేర్జిల, చినఖేర్జిల, సర్వపాడు గ్రామాల్లో తహసీల్దార్ కార్యాలయ సీనియర్ సహాయకురాలు శకుంతల ఆధ్వర్యంలో గురువారం ఈవీఎంల పనితీరుపై ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవీఎంల పనితీరు, ఓటును ఏ విధంగా వినియోగించుకోవాలి అన్న దానిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఎల్వోలు దివ్య, రాఘవరావు, గీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.

జోనల్ మలేరియా అధికారి పర్యటన

గుమ్మలక్ష్మీపురం: జోనల్ మలేరియా అధికారి డాక్టర్ ఎం.శాంతిప్రభ గురువారం మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. ఆమెతో పాటు జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహన్‌రావు సిబ్బందితో కలిసి చింతలపాడు, దుడ్డుకల్లు గ్రామ పీహెచ్‌సీలను సందర్శించారు. గ్రామాల్లో దోమల వ్యాప్తి చెందే ప్రదేశాలను గుర్తించి సచివాలయ సెక్రటరీల ద్వారా ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలో ఓపీ నిర్వహణ, ల్యాబ్ పరీక్షల రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సూర్యనారాయణ, వైద్యాధికారి ప్రవీణ్, సబ్ యూనిట్ అధికారి నారాయణరావు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

కురుపాం: కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జోనల్ మలేరియా అధికారిణి డాక్టర్ ఎం.శాంతిప్రభ గురు వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీలో ఓపీ, ల్యాబ్ పరీక్షల రికార్డులు తనిఖీ చేశారు. జ్వరాల కేసులు ఏ మేరకు నమోదు అవుతున్నాయని పరిశీలించారు. గుమ్మిడిగూడ గ్రామంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి జగన్మోహనరావు, కురుపాం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ బి.శోభారాణి, డాక్టర్ తనూజ, ఏఎంఓ సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి ఎస్.నారాయణరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జోనల్ మలేరియా అధికారిణి శాంతిప్రభ

క్లుప్తంగా..

రేపు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులకు శిక్షణ

గరుగుబిల్లి: తోటపల్లి జట్టు సంస్థ పరిధిలోని రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులకు వివిధ అంశాలపై శనివారం శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం.నూకంనాయుడు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం, కురుపాం, గరుగుబిల్లి మండలాల పరిధిలోని సంఘాల సభ్యులకు ఆహార ఉత్పత్తుల తయారీతో పాటు మార్కెటింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామాల నుంచి రైతులు, సభ్యులు హాజరుకావాలన్నారు.

కొట్టు సర్పంచ్‌గా పద్మావతి

కొమరాడ: మండలంలోని కొట్టు గ్రామ సర్పంచ్‌గా పద్మావతిని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో మల్లికార్జునరావు తెలిపారు. కొట్టు సర్పంచ్‌గా ఎన్నికైన తెర్లి నాగభూషణరావు గతేడాది అక్టోబరు 31న మృతి చెందారు. అప్పటి నుంచి సర్పంచ్ పదవి ఖాళీగా ఉంది. దీంతో ఉప సర్పంచ్‌గా ఉన్న పద్మావతిని సర్పంచ్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

అభివృద్ధే లక్ష్యం

భోగాపురం: అభివృద్ధే లక్ష్యంగా చేసుకుని టీడీపీ, జనసేన పార్టీలు పని చేస్తాయని జనసేన పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి లోకం నాగమాధవి అన్నారు. తూడెం గ్రామంలో గురువారం మన ఊర్లో జనవాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మద్యం సీసాల స్వాధీనం

భోగాపురం: మండలంలోని రెడ్డికంచేరు, పోలిపల్లి గ్రామ సమీపాల్లో 32 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వి.సూర్యకుమారి గురువారం తెలిపారు. ఆయా గ్రామ సమీపాల్లో మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామని, దీనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

నేడు కొబ్బరిముక్కల వేలం

చీపురుపల్లి: శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం కొబ్బరి ముక్కలు, చీరలు, జాకెట్ ముక్కలు వేలం వేయనున్నట్టు ఈవో జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ వేలం పాటకు ఉత్సాహవంతులు హాజరు కావాలని ఆయన కోరారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళిక తప్పనిసరి


బొండపల్లి: పంచాయతీల అభివృద్ధికి తప్పనిసరిగా ప్రణాళికలు తయారు చేసుకుని ప్రణాళి కాబద్ధంగా ముందుకు వెళ్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ చల్లా చలంనాయుడు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మూడు రోజులపాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు వీవోలకు నిర్వహించే శిక్షణలను ప్రారంభించి, వారిని ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీపీడీపీపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడానికి ఈ శిక్షణలు ఇస్తున్నట్టు తెలిపారు. ప్రతి పంచాయతీ పరిధిలో ఆదాయ వనరులను గుర్తించి వాటి ద్వారా పంచాయతీలకు కావాల్సిన మౌలిక వసతులను ఏర్పాటు చేసుకోవడానికి ఈ శిక్షణ దోహదపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వైవీ రాజేంద్రప్రసాద్, ఈవోపీఆర్డీ సీహెచ్ సుగుణాకరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రణాళిక తయారీపై అవగాహన అవసరం

భోగాపురం: పంచాయతీ, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళిక తయారీపై అందరూ అవగాహన చెందాలని ఎంపీడీవో అప్పలనాయుడు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి ఆధ్వర్యంలో ప్రణాళికా తయారీపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో, మండల పరిషత్‌కు సంబంధించి అభివృద్ధి ప్రణాళిక ఏవిధంగా తయారుచేయాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ఎంఈవో రమణమూర్తి, ఈవోపీఆర్డీవో సురేష్, కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కత్తెర పురుగుపై అప్రమత్తం

నెల్లిమర్ల: మొక్కజొన్న పంట లో కత్తెర పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఎం.పూర్ణిమ సూచించారు. మొయిద విజయరాంపురం గ్రామంలో మొక్కజొన్న పంటను ఆమె గురువారం పరిశీలించారు. మొక్క జొన్నకు కత్తెర పురుగు ఆశించినట్లు గుర్తించామన్నారు. ఈ పురుగు నివారణకు ఎకరాకు ఒక లీటర్ వేపనూనె, క్లోరోపైరిపోస్ అర లీటర్ పిచికారీ చేయాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో పూర్ణిమ

టెన్నికాయిట్ జాతీయ స్థాయి విజేత ప్రవల్లిక

చీపురుపల్లి: చీపురుపల్లి ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలకు చెందిన ఎం.ప్రవల్లిక టెన్నీకాయిట్‌లో జాతీయ స్థాయి విజేతగా నిలిచింది. శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన 47వ జాతీయ స్థాయి టెన్నీకాయిట్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచింది. బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న ప్రవల్లిక మిక్స్‌డ్ డబుల్స్ పోటీల్లో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. కాగా, జాతీయ స్థాయిలో చాంపియన్‌షిప్ గెలుచుకున్న ప్రవల్లికను కళాశాల ప్రిన్సిపాల్ డా.పీవీ కృష్ణాజీ, వైస్ ప్రిన్సిపాల్ డా.రమేష్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

పాఠశాలలకు ట్యాబ్‌లు

నెల్లిమర్ల: మండలంలోని ఉన్నత పాఠశాలల్లో ఎనిమిదో తరగతి విద్యార్థుల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు గురువారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఎంఈవో1, 2లు యు.సూర్యనారాయణ మూర్తి, ఈపు విజయ్‌కుమార్‌ల చేతులమీదుగా అందజేశారు. రెండో విడతగా మండలంలోని 12 పాఠశాలలకు 812 ట్యాబ్‌లు సరఫరా అయ్యాయని, వీటిలో 8 పాఠశాలలకు గురువారం పంపిణీ చేశామని తెలిపారు.

వైభవంగా తీర్థ మహోత్సవాలు

వేపాడ: వీలుపర్తి, పాటూరు, సింగరాయి, పెదగుడిపాల గ్రామాల్లో గురువారం గ్రామ దేవతల తీర్థ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. వీలుపర్తి గ్రామ దేవత నేరెళ్ల పైడిమాంబకు, పాటూరులో జగన్నాథ స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పెదగుడిపాల, సింగరాయిలో గ్రామ దేవతల తీర్థ మహోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


కోలాటం ఆడుతున్న మహిళలు